కార్పొరేటర్ పర్యటన



శ్రీనివాస్‌నగర్‌లో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ శ్రీనివాసనగర్‌లో గురువారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో చాలాకాలం క్రితం మంజూరైన రోడ్లను పరిశీలించారు. పాత కాంట్రాక్టర్ నెలరోజులుగా పనులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త కాంట్రాక్టర్‌కు రోడ్డు పనులను అప్పగించారు. వెంటనే పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డీఈ ప్రశాంతి, ఏఈ అభిషేక్, రామారావు, ప్రేమ్, సాజిద్, నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జయపాలన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. హెచ్‌బీకాలనీ, మంగాపురం కాలనీలో గురువారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. దశలవారీగా డివిజన్ వ్యాప్తంగా అంతర్గత రోడ్లతో పాటుగా సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, పనుల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకూడదన్నారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు కృషి చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్ కుమార్‌రెడ్డి అన్నారు. సన్ ఫైటర్స్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన 11వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు శక్తిని పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. యువతీయువకులు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని సూచించారు. విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల, కాకతీయ స్కూల్ జేజీఆర్ ఉన్నత పాఠశాల, శౌర్యపాఠశాల, రుషి స్కూల్ విద్యార్థులు గెలుపొందగా.. వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎఫ్‌కేఏ వ్యవస్థాపకులు నందప్రసాద్‌యాదవ్, మిట్ట నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సాయినగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దేవేందర్‌నగర్, గౌతమీనగర్, అంబేడ్కర్‌నగర్, రాజీవ్‌నగర్, జ్యోతినగర్, గణేష్‌నగర్, వీరారెడ్డి కాలనీ, ఇందిరానగర్, అన్నపూర్ణ కాలనీ, కమలానగర్, కాకతీయ కళానగర్, సీసీ ఎంబీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రామంతాపూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ గోఖలేనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అయ్యప్ప టెంపుల్ గోకులేనగర్, ఇందిరానగర్, కామాక్షిపురం, లక్ష్మీనగర్, మార్కండేయస్వామి ఆలయం, పోచమ్మ టెంపుల్, నెహ్రూనగర్, ప్రగతినగర్, ఆర్టీసీ కాలనీ, సత్యనారాయణ స్వామి దేవాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

మేడిపల్లి: 11కేవీ మేడిపల్లి ఫీడర్ 33/11కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 11కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.00గంటల వరకు పీఅండ్‌టీ, భరత్‌పురికాలనీ, వెస్టు కమలానగర్, వరంగల్ హైవే రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ హరినాథ్ సగ్గ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉప్పల్: ఉప్పల్ ఆర్టీఏ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ మాస్టర్ చెఫ్ హోటల్, సర్వే ఆఫ్ ఇండియా క్వార్టర్స్, కేవీ స్కూల్-1, వేంకటేశ్వర కాలనీ, సూర్యనగర్ కాలనీ, రాజ్యలక్ష్మి థియేటర్, సుమిత్రా ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

హబ్సిగూడలో..

ఐఎస్ఐ హబ్సిగూడ 33/11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జెఎస్ఎన్ కాలనీ, వీవీనగర్, విజ్ఞానపురి కాలనీ, శోభానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం



భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మును గురువారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ బేగంపేట విమానాశ్రయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.
– రామంతాపూర్

త్వరలోనే ఆర్‌యూబీ పనులు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాకతీయనగర్ వాసులు



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్/ మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ (సౌత్ అండ్ ఈస్ట్) రెసిడెంట్స్ అసోసియేషన్‌వాసులు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వాజ్‌పేయినగర్ ఆర్‌యూబీ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఆర్‌యూబీ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని, ప్రజల సహకారంతో వాజ్‌పేయినగర్ ఆర్‌యూబీ నిర్మించి ఇస్తానని భరోసా ఇచ్చారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వాజ్‌పేయినగర్ ఆర్‌యూబీ నిర్మాణం చేయాలని చెప్పడంతో ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి రైల్వే అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించామని స్పష్టం చేశారు. బద్దం పరుశురాంరెడ్డి, చందు, శ్రీనివాస్, సూరి, బాలకృష్ణ, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ..

మౌలాలి: వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి డివిజన్ల వారీగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చెక్కులను అందజేశారు. గురువారం వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన రమణయ్యకు రూ.23 వేలు, యాదమ్మకు రూ.24 వేలు, వసంతలక్ష్మికి రూ.17,500 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. బద్దం పరశురామ్‌రెడ్డి, చందు, సూరి, బాలకృష్ణ, ఫరీద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

డివిజన్ల సమస్యలు పరిష్కరించండి..

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్, వెంకటాపురం, మచ్చబొల్లారం డివిజన్‌లోని సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్‌ను కలిశారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్ ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ లైబ్రరీతో పాటు మచ్చబొల్లారంలో 7 కాలనీల డ్రైయిన్ ఔట్‌లెట్ సమస్య, శ్రీరామ్‌కాలనీ, మడికట్ల బస్తీలో వరదనీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, రమేష్, శరణగిరి, పవన్, శ్రీకాంత్‌రెడ్డి, సతీష్, సురేష్ పాల్గొన్నారు.



కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక నేతలు

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత

అల్వాల్: పిల్లలకు చదువుతోపాటు ఆటలు ఎంతో ముఖ్యమని మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి కె. స్వర్ణలత అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం నేరేడ్‌మెట్‌లోని రామకృష్ణాపురం అంబేడ్కర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేరేడ్‌మెట్ స్టేషన్ పోలీస్ అధికారి సైదులు, హెలెన్ కెల్లర్స్ సంస్థ అధినేత పఠాన్ ఉమర్‌ఖాన్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఆటల పోటీల్లో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. మొత్తం 15 ప్రత్యేక పాఠశాల నుంచి విద్యార్థులతో పాటు వివిధ సంస్థల దివ్యాంగుల ప్రతినిధులు హాజరు కాగా.. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



రామకృష్ణాపురంలో పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

శారదా పీఠాధిపతి మాధవానంద సరస్వతి



ఎంపీ ఈటల దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీత్రిశక్తి నల్లపోచమ్మ ఆలయంలో శారదా క్షేత్ర పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. అనంతరం స్వామివారు అనుగ్రహ భాషణం చేస్తూ.. గ్రామదేవతలైన అమ్మవారు సర్వ శక్తి స్వరూపిణిలు ఆదిపరాశక్తులని అమ్మవార్ల ఆలయాలు ఉన్న చోట దుష్టశక్తులు దూరమై అన్ని శుభాలే జరిగి ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారన్నారు.

ఆలయం సర్వాంగ సుందరంగా నిర్మించారు : ఎంపీ ఈటల రాజేందర్

నల్ల పోచమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ఆధ్యాత్మిక భావనలు ఉట్టి పడేలా నిర్మించారని, ఆలయ నిర్మాణానికి కృషిచేసిన ఆలయ నిర్వాహకులను ఆయన అభినందించారు. మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, ఈటల జమున, ఆలయ సలహాదారు మహాదేవ భట్ల లక్ష్మణ్‌ప్రసాద్‌శర్మ, చైర్మన్ గడ్డం సాయికిరణ్, అధ్యక్షుడు సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, అనీల్‌గౌడ్, నవీన్‌రెడ్డి, హనుమంత రావు, బిల్లాకంటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు దిశా నిర్దేశం

చర్లపల్లి పునశ్చరణ ముగింపులో జైళ్లశాఖ ఐజీ మురళిబాబు



మాట్లాడుతున్న జైళ్లశాఖ ఐజీ వై. మురళిబాబు

కుషాయిగూడ: వనరులను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరింత అభ్యున్నతి సాధించడంతో పాటు మెరుగైన సేవలందించాలని అధికారులకు తెలంగాణ జైళ్లశాఖ ఐజీ వై. మురళిబాబు దిశా నిర్దేశం చేశారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో గురువారం నిర్వహించిన 2024 పునశ్చరణ కార్యక్రమాన్ని జైళ్లశాఖ డీఐజీ డి.శ్రీనివాస్ ఉదయం ప్రారంభించగా.. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఐజీ మురళిబాబు హాజరై మాట్లాడారు. తెలంగాణ జైళ్లశాఖ అభివృద్ధి, ఖైదీల సంక్షేమం అమలులో హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది కంటే వచ్చే ఏడాది ఉత్తమ సేవలందించి పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. జైళ్లశాఖ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. తెలంగాణ డైరక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ టి. రఘునాథస్వామి, చర్లపల్లి , ఓపెన్ ఎయిర్‌జైల్ పర్యవేక్షణాధికారులు రామచంద్రం, సమ్మయ్య, ఉప పర్యవేక్షణాధికారి శశికాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు.. తప్పిన ప్రమాదం

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని వాణీనగర్ వీధి నెంబర్-1లో అగ్ని ప్రమాదం జరగగా..ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... అజయ్ భారతి నిలయం అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో వరలక్ష్మి అనే మహిళ నివాసం ఉంటుంది. గురువారం మధ్యాహ్నం ఆమె బయటికి వెళ్లొచ్చేసరికి షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. బెడ్రూమ్‌లో ఉన్న మంచం, పరుపు, బీరువాతో పాటు కిటికీలకు ఉన్న అద్దాలు పూర్తిగా కాలిపోతుండటంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల సైకిల్ ర్యాలీ

ఉప్పల్: ఉప్పల్ జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ అని, ప్రతి ఏటా నవంబర్ 4వ ఆదివారం ఎన్‌సీసీ డేను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. విద్యార్థులు 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ రాఘవేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు అజయ్‌సింగ్, విజయలక్ష్మి, నలిని, కృష్ణయ్య పాల్గొన్నారు.

◆ ఎన్‌సీసీ డే సందర్భంగా నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో కిలోమీటర్ మేర సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ కేడెట్లు 21 మంది జేడీ, జేడబ్ల్యూ 26, మొత్తం 47 మంది కేడెట్లు పాల్గొనగా.. ఎన్‌సీసీ ఆఫీసర్ 1, ఆర్మీ పీఐ స్టాఫ్, హెచ్ఏవీ జగ్‌మోహన్ సింగ్ ఉన్నారు.



సైకిల్ ర్యాలీలో ఉప్పల్ జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, కేడెట్లు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు



సర్టిఫికెట్లతో విద్యార్థినులు

మల్కాజిగిరి: జనవిజ్ఞాన వేదిక మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు చెకుముకి సైన్స్ సంబరాల పేరున పోటీలు నిర్వహించారు. జిల్లా కోశాధికారి జెన్నీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రజ్ఞాపాటవాలను వెలికి తీయాలంటే ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అధ్యాపకులు విభిన్నంగా పాఠ్యాంశాలు బోధించాలన్నారు. మండల అధ్యక్షుడు శివప్రసాద్, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, మురళీమోహన్, శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలు ఇవ్వాలి



డీఈఈకి వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌టీయూ నేతలు

మల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికులకు సరిపడ పనిముట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్‌టీయూ యూనియన్ నేతలు గురువారం కాప్రా సర్కిల్ డీఈఈకి వినతిపత్రం అందజేశారు. చెత్త ఎత్తడానికి రిక్షాలు, పారలు, గడ్డపారలు, సామగ్రి ఇప్పించాలని కోరారు. కాప్రా సర్కిల్ అధ్యక్షులు కుర్మన్న, గోవర్ధన్‌రెడ్డి, నరేష్, నరసింహ, శివయ్య, జాను తదితరులున్నారు.

ఆధునీకరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: ఇందిరానెహ్రూనగర్ కాలనీలో సుమారు 66 వీధులకు రూ.15 లక్షలతో చేపట్టిన మెట్ల ఆధునీకరణ పనులను కార్పొరేటర్ సునీతారాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాధాన్యత క్రమంలో డివిజన్‌లోని అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, స్థానిక నేతలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

సహకార సంఘం భూమిని ఆక్రమిస్తే సహించం

అల్వాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ తోట గోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తోట గోపాల్‌రెడ్డి

అల్వాల్: రైతు సేవా సహకార సంఘానికి చెందిన భూమిని ఆక్రమించడానికి యత్నిస్తే సహించేది లేదని అల్వాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ తోట గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం అల్వాల్‌లోని సొసైటీ భవనంలో ఆయన మాట్లాడుతూ.. 1997లో షామీర్‌పేట్ మండలంలోని దేవరయంజాల గ్రామం పరిధిలోని సర్వే నెంబర్ 782లో నాటి ప్రభుత్వం రైతు సేవా సహకార సంఘం అభివృద్ధికి 9 ఎకరాల 24 గుంటల స్థలాన్ని కేటాయించిందన్నారు. దీనికోసం రూ. 2 లక్షలు ప్రభుత్వానికి చెల్లించామన్నారు.

ఐదెకరాలకు పైగా సముదాయాలు..

సదరు స్థలంలో ఐదెకరాలకు పైగా కొన్ని సముదాయాలను నిర్మించి సంఘం కార్యకలాపాలు కొనసాగిస్తున్నామన్నారు. మిగితా 4 ఎకరాలకు పైగా స్థలం ఖాళీగా ఉండటంతో కొందరు ఆక్రమించడానికి ప్రయత్నాలు చేయగా.. వారిపై కేసులు నమోదు చేయించడంతో పాటు కోర్టును ఆశ్రయించగా.. సొసైటీకి అనుకూలంగా న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు.

తప్పుడు ధ్రువపత్రాలతో ఆక్రమణకు యత్నం..

రెండ్రోజుల క్రితం కొందరు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి సొసైటీ స్థలం ఆక్రమణలకు ప్రయత్నించగా.. అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వందలాది మంది రైతుల సమూహంగా ఏర్పడిన సొసైటీ స్థలాన్ని ఆక్రమించడానికి యత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని ఆయన హెచ్చరించారు. సొసైటీ బ్యాంక్ చైర్మన్ ప్రేమ్‌నాథ్, డైరెక్టర్ చంద్రమౌళి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కేసు నమోదు..

అల్వాల్ రైతు సేవా సహకార సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ తెలిపారు.

అక్రమ పార్టిషన్లు తొలగించాలి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో పారిశ్రామికవాడ కమిషనర్ ప్రభాకర్

కుషాయిగూడ: కాప్రా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో అక్రమంగా ఏర్పాటు చేసిన పార్టిషన్లను వెంటనే తొలగించాలని కుషాయిగూడ పారిశ్రామిక వాడ కమిషనర్ ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. పార్కింగ్ సమస్యలపై సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి అక్రమ పార్టిషన్లు ఏర్పాటు చేసిన వారికి నోటీసులు జారీజేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతులను పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటానని కమిషనర్ స్పష్టం చేశారు. పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు అక్రమ పార్టిషన్ల ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకుంటానని వివరించారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి



శుభోదయకాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి, అధికారులు

మౌలాలి: తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని 'అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం' (ఐద్వా) మండల కార్యదర్శి మంగ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం వాటర్‌వాల్స్ అధికారిని వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. పీఎస్ఆర్ కాలనీలో తాగునీరు రెండ్రోజులకోసారి సరఫరా అవుతోందన్నారు. ఎగువ ప్రాంతాలకు నీటి సరఫరా కావడంలేదన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశామన్నారు. జలమండలి అధికారులు ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు. లేదంటే స్థానిక మహిళలతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు చల్లా లీలావతి, రాజ్యలక్ష్మి, సుజాత, పుణ్యమ్మ, లక్ష్మి, పద్మావతి, అనూష, అనిత, లక్ష్మి, సంధ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

లోప్రెషర్ సమస్యలపై..

కుషాయిగూడ: డివిజన్‌లో లోప్రెషర్ సమస్యలు నీటి సరఫరాలో తలెత్తకుండా చూడాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని శుభోదయకాలనీ, ఓల్డ్ సోనియాగాంధీనగర్ కాలనీల్లో లోప్రెషర్‌తో ఇబ్బంది పడుతున్న విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఆమె వాటర్‌వర్క్స్ ఏఈ సందీప్‌తో కలిసి కాలనీల్లో పర్యటించారు. స్థానిక మహిళలతో మాట్లాడి లోప్రెషర్ సమస్యను తెలుసుకుని అధికారులకు వివరించారు. తగినచర్యలు తీసుకుని లోప్రెషర్ సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

24న ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న పటోళ్ల సురేందర్‌రెడ్డి

అల్వాల్: ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి, ఫోరం మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షులు పుట్నాల కృష్ణ ఆధ్వర్యంలో గురువారం అల్వాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 24న సంజీవరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి సన్నాహాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి బోనాలు, బతుకమ్మ వేడుకలు ఊరేగింపు ఉంటాయని, అనంతరం సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.